క్లుప్తంగా

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



పెందుర్తి: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పదో రోజు బుధవారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుముర్రై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్టి జరిపారు. 10వ పాశుర విన్నపం చేశారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

చినముషిడివాడలో 'ఫ్రెష్ చాయిస్' స్టోర్



ఫ్రెష్ చాయిస్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న సంస్థ సీఈవో నర్సింహరాజు

పెందుర్తి: చినముషిడివాడలో ఫ్రెస్ చాయిస్ బేకరీని ఆ సంస్థ సీఈవో కె.నరసింహరాజు చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నగా మొదలైన తమ ప్రస్థానం తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా నడుస్తోందన్నారు. రెండు రాష్ట్రాల్లోనాణ్యమైన కేక్‌ల తయారీకి తమ సంస్థ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. తెలుగు ప్రజల కేక్ రుచిని మార్చిన సంస్థగా ఫ్రెష్ చాయిస్ పేరొందిందన్నారు. రానున్న నూతన సంవత్సరంతో పాటు పుట్టిన రోజులు, ఇతరత్రా శుభకార్యాలకు అత్యుత్తమ నాణ్యతతో తక్కువ ధరలకే కేకులు అందించనున్నట్లు తెలిపారు. ఫ్రెష్ చాయిస్ ప్లమ్ కేకులకు ప్రత్యేకతగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్టోర్ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పరవాడ: మాజీ ప్రధాని భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను పరవాడ గ్రామంలో బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ స్థానిక నాయకుడు కూండ్రపు సోమునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మిల్క్ డెయిరీ అధ్యక్షుడు కూండ్రపు చినబాబు, నాయకులు పైల జగన్నాథరావు, జి.శ్రీనుబాబు, బండారు ఆజేయ్‌కుమార్, లాలం సురేష్, బండారు కోటి, అక్కునాయుడు పాల్గొన్నారు.

పెందుర్తిలో 'ఓలా' షోరూమ్



ప్రారంభిస్తున్న శరగడం చినఅప్పలనాయుడు

పెందుర్తి: ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఓలా షోరూమ్, సర్వీసింగ్ సెంటర్‌ను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శరగడం మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాలతో పర్యావరణానికి హాని ఉండదని అన్నారు. వినియోగదారులకు తక్కువ ధరలకు వాహనాలను అందించడంతో పాటు సర్వీసింగ్ కూడా సకాలంలో చేయాలని సూచించారు. ఓలా కోస్టల్ సిటీ లీడ్ వాన లోకేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారులకు ఎస్-1 ఫోర్ట్‌ఫోలియో వాహనంపై రూ.25 వేల వరకు తగ్గిస్తామన్నారు. ఏరియా సర్వీస్ మేనేజర్ డి.ఎస్.ఎన్.మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

100 శాతం ఉత్తీర్ణతకు రోజుల ప్రణాళిక

పదో తరగతి.. విద్యార్థి దశలో ఉత్తమ భవితకు ప్రథమ సోపానం. కార్పొరేట్ పోటీ ప్రపంచంలో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుల పనితీరుకూ కొలమానం. అందుకే 100 శాతం ఫలితాల కోసం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికతో విద్యాశాఖ ముందుకెళ్తోంది. సబ్బవరం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ ప్రణాళికను ఈ నెల 1 నుంచే పక్కాగా అమలు చేస్తున్నారు. శతశాతం ఉత్తీర్ణత కోసం శతదా కృషిచేస్తున్నారు.



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

- టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు 100 డేస్ కార్యాచరణ
- రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- స్టూడెంట్ అడాప్షన్ విధానంతో వ్యక్తిగత పర్యవేక్షణ
- ప్రైవేట్/కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నిర్వహణ

సబ్బవరం:

పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణులయ్యేలా పాఠశాల విద్యాశాఖ 100 రోజుల ప్రణాళికతో సిద్ధమయింది. డిసెంబర్ 1 నుంచి ప్రభుత్వ స్కూళ్లలో సబ్జెక్టులవారీగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ప్రైవేట్/కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు, అత్యుత్తమ మార్కులు సాధించాలనే సంకల్పంతో, విద్యార్థుల్ని పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

'స్పెషల్' ఫోకస్

ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా ఇప్పటికే విభజించారు. వారి సామర్థ్యాల మేరకు తప్పనిసరి ఉత్తీర్ణత నుంచి అత్యుత్తమ మార్కుల సాధన వరకు అవలంబించాల్సిన కార్యాచరణను తూచా తప్పక పాటిస్తున్నారు. ఇందులో భాగంగానే టెన్త్ విద్యార్థులకు రోజూ ఉదయం 8 నుంచి 9, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా సబ్జెక్టు టీచర్లు స్కూళ్లకు వచ్చి, క్లిష్టమైన పాఠ్యాంశాలపై పునఃశ్చరణ తరగతులు బోధిస్తున్నారు. ప్రధానంగా డి గ్రేడ్ విద్యార్థులు అత్తెసరు మార్కులతోనైనా పాసయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.



దత్తతతో అదనపు శ్రద్ధ



గత కొన్నేళ్ల నుంచి పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత పెంచేందుకు వినూత్న పద్ధతుల్ని అవలంభిస్తోంది. గత ప్రభుత్వ హయాం నుంచి వీటి అమలు పక్కాగా జరిగేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాల యూనిట్‌గా అక్కడ పనిచేసే టీచర్లు టెన్త్ విద్యార్థుల్ని దత్తత(అడాప్షన్) తీసుకునే విధానాన్ని ప్రారంభించారు. పాఠశాల స్థాయి మేరకు ఒక్కో టీచర్‌కు 4-6 గురు విద్యార్థుల బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఈ విద్యార్థులు ఎప్పటికప్పుడు సబ్జెక్టు టీచర్ నిర్దేశించిన పాఠ్యాంశాలను నేర్చుకునేలా సదరు దత్తత టీచర్ పర్యవేక్షిస్తున్నారు. చదువుతోపాటు ఆరోగ్యం, ఇంటి వద్ద చదువుకునే వాతావరణం ఉండేలా తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. స్కూల్ నుంచి ఇంటికెళ్లాక రాత్రుళ్లు కూడా చదువుతున్నారా? లేదా? అన్నది స్వయంగా వెళ్లి పర్యవేక్షిస్తున్నారు.

స్పెషల్ క్లాస్‌లతో మేలు



100 రోజుల ప్రోగ్రాం మాకు చాలా ఉపయోగంగా ఉంది. రోజూ ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు స్పెషల్ క్లాసులులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా టీచర్లు వచ్చి, సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలను రివిజన్ చేయిస్తున్నారు. రోజూ స్లిప్ టెస్టులు పెట్టి వెంటనే పేపర్లు దిద్ది పొరపాట్లను తెలియచెప్తున్నారు. అక్కడికక్కడే సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

– భావన ప్రియ, 10వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సబ్బవరం

అన్ని స్థాయిల విద్యార్థులపైనా శ్రద్ధ



శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులమంతా అంకిత భావం, నిబద్ధత, సమన్వయంతో పనిచేస్తున్నాం. సెలవు దినాల్లో సైతం స్కూల్‌కు వస్తున్నాం. ఎస్‌సీఈఆర్‌టీ ఇచ్చిన ప్రణాళికలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నాం. అన్ని స్థాయిల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల్లోనూ మెరుగైన ఉత్తీర్ణత సాధిస్తామన్న నమ్మకం ఉంది.

– సీహెచ్ సునీత, బయాలజీ టీచర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సబ్బవరం

ఐదుగురేసి విద్యార్థుల అడాప్ట్



పాఠశాలలో టెన్త్ విద్యార్థులు 117 మంది, టీచర్లు 24 మంది ఉన్నారు. ఒక్కో టీచర్ ఐదుగురేసి విద్యార్థులు చొప్పున అడాప్ట్ చేసుకున్నారు. పరీక్షలు పూర్తయ్యేంత వరకూ ఆ విద్యార్థుల చదువుతో పాటు, వారి ఆరోగ్యం, ఇతర సమస్యలపైనా ఈ టీచర్లు పర్యవేక్షిస్తారు. ఇంటి వద్ద చదువుకునే వాతావరణం ఉండేలా తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం.

– తిరుపతిరావు, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సబ్బవరం

పక్కాగా ప్రణాళిక



విద్యాశాఖ ఇచ్చిన 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. స్పెషల్ క్లాస్‌లపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. ప్రత్యేక తరగతులకు విద్యార్థులంతా హాజరయ్యేలా తల్లిదండ్రులను సంప్రదిస్తున్నాం. సెలవు రోజుల్లో కూడా వచ్చి పిల్లల సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుల కష్టాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గుర్తించాలి. ప్రతి విద్యార్థి పాసయ్యేలా కృషి చేస్తున్నాం.

– ఎం.లక్ష్మణరావు, మండల విద్యాశాఖాధికారి, సబ్బవరం

సింహాచలేశుని క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సింహాచలం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం రూపొందించిన 2025 క్యాలెండర్లను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు బుధవారం విజయనగరంలో ఆవిష్కరించారు. స్వామివారి నిత్యరూపంతో ఒక క్యాలెండర్, 12 రూపాలతో కలిపి మరో క్యాలెండర్‌ను దేవస్థానం రూపొందించింది. త్వరలోనే వీటి విక్రయాలు జరపనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మేలుకొలుపులతో గ్రామాల్లో ఆధ్యాత్మికత



నాయుడుపాలెంలో పల్లకీ ఊరేగింపులో భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, పరవాడ, లంకెలపాలెం, వెన్నలపాలెం గ్రామాల్లో పదో రోజు మేలుకొలుపు కార్యక్రమాలను భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవాలయాలు ఆధ్వర్యంలో భగవన్నామస్మరణతో వీధుల్లో భగవంతుడి పల్లకీలను ఊరేగించారు. భజన పాటలు పాడుతూ, రామనామ సంకీర్తనలు చేస్తూ వీధివీధినీ తిరిగారు. దేవాలయాలు కేంద్రాలుగా ప్రతివారం నగర సంకీర్తన చేయాలని ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని భక్తులందరు పాల్గొని విజయవంతం చేయాలని ఫౌండేషన్ ప్రతినిధి వెన్నల అప్పలనాయుడు పిలుపునిచ్చారు.

చినుకు పడితే చిత్తడే..



బురదమయంగా వేద పాఠశాలకు వెళ్లే మార్గం



పరిపాలనా కార్యాలయానికి వెళ్లే మార్గంలో వర్షం నీటితో గుంతలు

సింహాచలం: చిన్నపాటి వర్షం పడితే చాలు.. సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ పరిపాలనా కార్యాలయానికి వెళ్లే దారి అస్తవ్యస్తంగా మారుతోంది. ఈ మార్గంలో ఉన్న గోతుల్లో నీరు చేరి, బురదగా మారి నడిచేందుక్కూడా వీల్లేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో దేవస్థానం ఉద్యోగులతోపాటు, కార్యాలయానికి సమాచారం కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదే దారిలో వేద పాఠశాల కూడా ఉంది. వేద విద్యార్థుల రాకపోకలకు కష్టపడాల్సి వస్తోంది. దేవస్థానం ఇంజినీరింగ్ అధికారుల చాంబర్లు ఈ భవనంలోనే ఉన్నాయి. నిత్యం ఆ మార్గంలోనే ఇంజినీరింగ్ అధికారులు రాకపోకలు సాగిస్తున్నా, రోడ్డు గురించి మాత్రం పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, భక్తులు కోరుతున్నారు.

పగటి పూట విద్యుత్ దీపాల వెలుగులు

పరవాడ: గ్రామ పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంతో ప్రతి నెలా రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వీధి దీపాలను రాత్రి వేళ వెలిగించి, ఉదయం ఆపకుండా వదిలేస్తున్నారు. కలపాక గ్రామంలో బుధవారం పట్టపగలు వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్‌ను పొదుపుగా వాడాల్సిన పంచాయతీ సిబ్బంది విధుల్లో నిర్లిప్త వైఖరి వల్లే గ్రామ పంచాయతీపై అధనపు భారం పడుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కలపాక గ్రామ సచివాలయ కార్యాలయంపై మంగళవారం రాత్రి వెలిగించిన లైట్లను ఆర్పే నాథుడు లేక రాత్రీపగలూ వెలుగుతూనే ఉన్నాయి. విధులు ముగిసిన తర్వాత సచివాలయ సిబ్బంది తమకేమీ పట్టనట్లుగా వెళ్లిపోతున్నారని గ్రామస్తులు ఆక్షేపిస్తున్నారు.



కలపాక గ్రామంలో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపం



కలపాక గ్రామ సచివాలయంపై పగలే వెలుగులు పంచుతున్న విద్యుత్ దీపం

పంచాయతీ కాలువను పూడ్చి, ఆక్రమించి..



పంచాయతీ కాలువను పూడ్చి, రక్షణ గోడను విరగ్గొట్టి మట్టి రోడ్డు నిర్మించిన రియల్టర్

పరవాడ: ఓ రియల్టర్ తన స్థలాన్ని ఆనుకుని ఉన్న గ్రామ పంచాయతీ కాలువను కప్పేసి, మరుగుదొడ్ల గోడను కూల్చేసి తన భూమికి రహదారిని నిర్మించుకున్నారు. మండల కేంద్రమైన పరవాడలో మంగళవారం రాత్రి ఈ కబ్జా వ్యవహారం చోటుచేసుకుంది. సదరు రియల్టర్ తన భూమికి అడ్డుగా ఉన్న మురుగు కాలువను పూడ్చేశాడు. తన స్థలాన్ని అధిక ధరకు అమ్ముకునేందుకు వీలుగా రోడ్డు ఫేసింగ్ కోసం అడ్డుగా ఉన్న మరుగుదొడ్ల ప్రహరీ గోడను ధ్వంసం చేసి మరీ రహదారిని నిర్మించుకున్నాడు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో, ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మంగళవారం రాత్రి ఈ చర్యకు దిగాడు. అధికార పార్టీ అండదండలతోనే ఈ ఆక్రమణకు పాల్పడినట్లు స్థానికులు చెప్తున్నారు. తన స్థలానికి రహదారి నిర్మాణం కోసం పంచాయతీ మురుగునీటి కాలువను పూడ్చడంతో మురుగు నీరు ప్రవహించేందుకు వీల్లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. రియల్టర్‌పై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఓ ప్రభువా.. ఇది నీ కృపయే..



కేథలిక్ చర్చిలో క్రిస్మస్ సందేశాన్ని అందిస్తున్న ఫాదర్లు థామస్ పులికల్, దాస్



కేథలిక్ చర్చిలో భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేసిన బాల ఏసు



సబ్బవరం సీబీఎం చర్చిలో క్రైస్తవ మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

- వాడవాడలా క్రిస్మస్ సంబరాలు
- చర్చిలు, ఇళ్లలో ప్రత్యేక ప్రార్థనలు

సబ్బవరం: మండలంలోని పలు చర్చిలలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరంలోని కేథలిక్ చర్చిలో ఫాతిమా మాత చర్చి ప్రీస్ట్ థామస్ పులికల్, ముఖ్య అతిథిగా ఫాదర్ దాస్‌లు పాల్గొని భక్తులకు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కేథలిక్ చర్చి యూత్ ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. బాల ఏసు విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ప్రదర్శించారు. క్రిస్మస్ సందర్భంగా శాంతాక్లాజ్ బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్బవరం కేథలిక్ చర్చ్ ప్రతినిధులు పి.మాణిక్యాలరావు, పీటర్, ఆడారి నాగరాజు, శరగడం గణేష్, డేవిడ్, మద్దాలి, ఆనంద్, సిస్టర్స్ అలీస, పునీత, విజయప్రభ, సోనా, ఫ్లోరా, వినీత తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక సీబీఎం చర్చిలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొని ప్రార్థనలు చేశారు. క్రీస్తు భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చికి వచ్చిన మహిళలకు ఆయన చేతులమీదుగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ కర్రి కనకరాజు, పార్టీ సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల రమణ, మామిడి శంకరరావు, బంతికోళ్ల పద్మ, కిల్లి వెంకట సత్యనారాయణ, గొర్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ చోరీ



కాపర్ చోరీ తర్వాత మిగిలిన ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్

పరవాడ: మండలంలోని పి.బోనంగి సమీపంలో ఏపీ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దొంగిలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కొంత కాలంగా నిరుపయోగంగా వదిలేశారు. దీని స్థానంలో అదనపు సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని అక్కడే పక్కన పెట్టారు. అదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను నిచ్చెన సాయంతో కిందికి దించి ట్రాన్స్‌ఫార్మర్‌లో అమర్చిన విలువైన కాపర్ వైరును దొంగిలించి, ఖాళీ డబ్బాను విడిచిపెట్టారు. దొంగిలించిన కాపర్ వైరు విలువ రూ.వేలల్లో ఉంటుందని అధికారులు చెప్తున్నారు. దీనిపై ఈపీడీసీఎల్ అధికారులు బుధవారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పరవాడ: స్టీల్ ప్లాంట్‌లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రావాడ శివారు ధర్మారాయుడుపేట జెడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. విశాఖ కంటి ఆస్పత్రి, సన్‌షైన్ ఐకేర్ ఆస్పత్రుల సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 65 మంది రోగులకు కంటి పరీక్షలు జరిపారు. ఐదుగురిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరికి విశాఖ కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయనున్నారు. శిబిరంలో పాల్గొన్న పలువురికి మధుమేహం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ ప్రతినిధి మంత్రి జగన్నాథరావు మాట్లాడుతూ 1991 నుంచి క్లబ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు శిబిరాన్ని ప్రారంభించగా, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పి.రావు, కంటి వైద్య నిపుణులు పాల్గొన్నారు.

రామాలయ నూతన కార్యవర్గం ఎన్నిక



కొలువుదీరిన రామాలయం నూతన కమిటీ

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీ రామాలయం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా తంటపురెడ్డి చిరంజీవిరావు, కార్యదర్శిగా సిరికి నాయుడు, కోశాధిగారిగా టి.వి.శేషారావు నియమితులయ్యారు. మరో 15 మందిని ఆలయ కమిటీ సభ్యులుగా నియమించారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తామని కమిటీ తెలిపింది. సింహపురి కాలనీ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి, అధ్యక్షుడు కామేశ్వరరావు, నాయకులు చింతా రావు, చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

ఫొటోగ్రఫీపై ఒక రోజు శిక్షణ



ఉమ్మడి విశాఖ నలుమూలల నుంచి వచ్చిన ఫొటోగ్రాఫర్స్

సబ్బవరం: స్థానిక శ్రీదుర్గమాంబ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అప్పారావు ఆధ్వర్యంలో సోనీ వర్క్ షాప్ నటరాజ కిశోర్ సౌజన్యంతో ఫొటోగ్రాఫర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గొటివాడలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో జరిగిన ఈ శిక్షణలో సోనీ కెమెరా స్పెషలిస్టులు ఎంఎస్ సతీష్ శెట్టి, ఎంఆర్ షారుక్ మెహదీలు ఫొటోగ్రఫీలో వివిధ సాంకేతిక అంశాలు, నైపుణ్యాలను వివరించారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు, గాజువాక అధ్యక్షుడు మధు, అనకాపల్లి అధ్యక్షుడు రమేష్, దుర్గమాంబ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎస్.నాగేంద్ర, ప్రతినిధులు పి.కిశోర్, ఎస్వీఎస్ శ్రీనివాసరావు, అప్పలరాజు, రాము, రమణ తదితరులు పాల్గొన్నారు.